క్లుప్తంగా

12 మద్యం బాటిళ్లు పట్టివేత

కలసపాడు : మండలంలోని దూలంవారిపల్లె గ్రామంలో మంగళవారం 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగమురళి తెలిపారు. మంగళవారం దూలంవారిపల్లెకు చెందిన ఓ.జయన్న గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, ఎస్బీ కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

పోరుమామిళ్ల : పట్టణంలోని లిటిల్ ఏంజిల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. మూడు రోజుల సంక్రాంతి పండుగ విశిష్టతను వివరిస్తూ కరస్పాండెంట్ రంగాచారి విద్యార్థులతో భోగిమంటలు వేయడం దగ్గర నుంచి కనుమ పండుగ వరకు ప్రదర్శనలు ఇప్పించారు. విద్యార్థులకు నిర్వహించిన ముగ్గులపోటీలు, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ధీరవనిత ఫాతిమా

బద్వేలు అర్బన్ : దళిత, మైనార్టీ వర్గాల మహిళలకు, పిల్లలకు విద్యాహక్కు కోసం గళమెత్తిన ధీరవనిత షేక్‌ఫాతిమా అని జ్యోతిరావుపూలే ఆశయసాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి, రత్నం ఇంగ్లీషుమీడియం స్కూల్ కరస్పాండెంట్ తలారిరత్నంలు పేర్కొన్నారు. ఫాతిమాబేగ్ జయంతి సందర్భంగా మంగళవారం రత్నం ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భారతదేశపు మొదటి ముస్లీం మహిళా ఉపాధ్యాయురాలుగా అణగారిన వర్గాలకు, బాలికల విద్య కొరకు సావిత్రిబాయిపూలేతో కలిసి ఉపాధ్యాయనీగా పనిచేసిన స్త్రీ విద్యాదాత ఫాతిమాబేగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆవాజ్ పట్టణ అధ్యక్షులు అబ్దుల్‌సత్తార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహీర్‌బాష, మైనార్టీ నాయకులు కె.బి.రసూల్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

చాపాడు : మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సోదరుడు, ప్రొద్దుటూరులోని సుధా థియేటర్ ఎజమాని కీ.శే.నాగేశ్వర్‌రెడ్డి కుమారుడు శెట్టిపల్లె నాగ సుమంత్‌రెడ్డి అలియాస్ మాయ(44) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులు నివాళులర్పించారు. ప్రొద్దుటూరులో బుధవారం ఉదయం 9గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఆస్పత్రుల్లో కాన్పులు శ్రేయస్కరం

ప్రొద్దుటూరు క్రైం : ఆసుపత్రుల్లో కాన్పులు కావడం ఎంతో శ్రేయస్కరమని వైద్యులు హిమబిందు, అనూషా వల్లంకొండు తెలిపారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీరోడ్డు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణులకు ధ్రితి హాస్పిటల్ గైనకాలజిస్టు డాక్టర్ అనూషా , టీబీరోడ్డు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు వైద్య పరీక్షలు చేశారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

కమలాపురం : పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మలత తెలిపారు. మంగళవారం లేటపల్లెలో జరిగిన వికసిత భారత్ కార్యక్రమంలో ఆమె రైతులకు వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. రైతుల శ్రేయస్సును కోరి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, ఆదాయం సాధించవచ్చన్నారు. ఊటుకూరు కేవీకే శాస్త్రవేత్త సాయి కిరణ్మయి మాట్లాడుతూ రైతులు పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు, మెలకువలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు డ్రోన్‌లను సబ్సిడీపై అందిస్తుందన్నారు. డ్రోన్‌ల ద్వారా పెస్టిసైడ్స్ సులభంగా తక్కువ సమయంలో పిచికారి చేసుకోవచ్చన్నారు.

ప్రజా సంకల్పయాత్ర సువర్ణాక్షరాలతో లిఖించబడింది

ప్రొద్దుటూరు : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజా సంకల్పయాత్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంకల్పయాత్ర పూర్తయి ఐదేళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక రాచమల్లు వారి రాజన్న భోజన శాల వద్ద ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి అందరికి పంచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ ఓ మారు పార్టీ ఓటమి చెందినా పట్టుదలతో దీక్షబూని జగన్ విజయం సాధించారన్నారు. ఎండకు, వానకు 3,648 కిలోమీటర్ల మేర ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేశారన్నారు. టీడీపీ నేత లోకేష్ తరహాలో జగన్ ఈవినింగ్ వాక్ చేయలేదన్నారు. పాదయాత్ర ముగింపు సభకు తాను కూడా హాజరై మాట్లాడిన సందర్భాన్ని జీవితంలో మరిచిపోలేనన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల సంగ్రామానికి అందరూ సిద్ధంగా ఉండాలని పార్టీ క్యాడర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్లు ఖాజా, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి తదితరులు పాల్గొన్నారు.


వైఎస్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే రాచమల్లు సమక్షంలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి

ప్రజాసంకల్ప యాత్రకు ఐదేళ్లు

పోరుమామిళ్ల : ప్రజాసంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తయ్యాయని, ప్రజాక్షేత్రంలో ఇచ్చిన ప్రతి మాటను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కొనసాగాలంటే మళ్లీ ఆయనే 2024లో ముఖ్యమంత్రిగా రావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ రూరల్‌డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, బద్వేలు మునిసిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కె.రమణారెడ్డి, వైస్‌ఎంపీపీ రాజశేఖర్, కో ఆప్షన్ మెంబర్ అల్లా, ఎంపీటీసీ ఇస్సాక్,మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, పట్టణ కన్వీనర్ హబీబ్, కూల్‌డ్రింక్ బాబు, మస్తాన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న డీసీ గోవిందరెడ్డి

నేడు ఉరుసు

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లెలో పెనుగొండ బాబాఫక్రుద్దీన్ స్వాముల వారి ఉరుసు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం దర్గా వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు రాత్రి ఖవ్వాలి నిర్వహించనున్నారు.

11న డయల్ యువర్ డీఎం

మైదుకూరు : ఈనెల 11వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు డిపో పరిధిలో ఆర్టీసీ సేవలపై 11వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫిర్యాదులు, సలహాలు, సూచనలు 9959225781 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

నేడు రైతులతో సమావేశం

రాజుపాళెం : జాతీయ రహదారికి భూములు కోల్పోయే రైతులతో బుధవారం ఉదయం ఎంపీడీఓ సభాభవనంలో రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఇందిరారాణి తెలిపారు. మండలంలోని దద్దనాల, అర్కటవేముల, పగిడాల, గోపాయపల్లె రెవెన్యూ గ్రామ పొలాల రైతులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ రహదారికి భూములు కోల్పోయే రైతులందరూ రావాలని తహసీల్దార్ సూచించారు.

గర్భిణులు రక్తహీతన జాగ్రత్తలు పాటించాలి

చాపాడు : గర్భిణులు రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గర్భిణులకు ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ యోజన ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయన పాల్గొని గర్భిణులకు వైద్యులు శ్రీవాణితో కలసి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పు కావాలని సూచించారు. ఇక్కడ అన్ని రకాలైన సౌకర్యాలతో పాటు వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన గర్భవతులు, వైద్య సిబ్బందికి స్థానిక భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేష్‌కుమార్

ప్రజా సంక్షేమానికి సీఎం విశేష కృషి

ప్రొద్దుటూరు కల్చరల్ : పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో మంగళవారం ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ కింద 8 మందికి రూ.12 లక్షల చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెంచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కల్లూరు ప్రసాదరెడ్డి, దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, రాముడు, సాధు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను లబ్ధిదారులకు అందచేస్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రొద్దుటూరు విద్యార్థి

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎస్‌వీపీ జమాల్ బాషా రాష్ట్రస్థాయి జావెలిన్‌త్రో పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ అనంతపురంలో జనవరి 4 నుంచి 6వ తేదీ వరకు రాష్ట్ర అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. రీజనల్ మీట్ జావెలిన్ త్రోలో జమాల్ బాషా ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. మార్చిలో జరగబోయే దక్షిణాది అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఎలక్ట్రికల్ విభాగాధిపతి మంజునాథ్, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ అశ్వర్థ రెడ్డి పాల్గొన్నారు.


జమాల్ బాషాను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు

వైఎస్సార్ విద్యార్థి విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ

పోరుమామిళ్ల : వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం క్యాలెండర్‌ను పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి సాయిదత్త, ప్రధాన కార్యదర్శి చాపాటి సాయి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రాజగోపాల్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గోవిందరెడ్డి

200 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు

పోరుమామిళ్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 200 మందికి మంగళవారం రక్తపరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ యువజన విభాగం అధ్యక్షుడు గిరిప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఎన్ఎస్ఎస్ విభాగం సహకారంతో బ్లెస్ బ్రెయాన్ ఆసుపత్రి సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. రక్త గ్రూపు, రక్తదానం, ఆరోగ్య పరిరక్షణ గురించి ప్రిన్సిపాల్ రామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగేశ్వరరెడ్డి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, రంతుబాష, బాలరాజు పాల్గొన్నారు.


రక్తపరీక్షలు చేస్తున్న బ్రెయాన్ ఆసుపత్రి సిబ్బంది

వైద్య పరీక్షలు

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపోకు చెందిన అధికారులు, ఉద్యోగులు, ప్రయాణికులకు మంగళవారం పూజిత న్యూట్రిషన్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా శరీరంలో కొవ్వు శాతం, ఎముకల సాంద్రత, నీటి శాతంపై పరీక్షలు నిర్వహించి.. వయసుకు తగిన ఎత్తు, బరువు విషయంలో సలహాలు సూచనలు ఇచ్చారు. న్యూట్రిషన్ సెంటర్‌కు చెందిన తదితరులు ఆర్టీసీ ఉద్యోగులకు ఆధునిక జీవన విధానంలో ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

రాజుపాళెం : ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం రాజుపాళెంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటరెడ్డి మండల స్థాయి క్రీడా పోటీలను ఈనెల 20వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను మండల కేంద్రమైన రాజుపాళెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని, గ్రామస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు తప్పనిసరిగా మండల స్థాయి పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

సీపీఐ నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి సెంటర్‌లో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం వెంటనే ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి షరీఫ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం ఆందోళన నిర్వహించారు. సమ్మె చేస్తున్న వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం ఎస్మా చట్టం అమలు చేసిన నేపథ్యంలో సమ్మె చేయడం నేరమని పోలీసులు హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, లేదా జైల్లో పెట్టాలని నినాదాలు చేశారు.

బోదకాలు వ్యాధిపై అవగాహన

బి.కోడూరు : మండలంలోని పాయలకుంట్ల గ్రామంలో మంగళవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో భోదకాలు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోదకాలు వ్యాధి ఆడ క్యూలెక్స్ దోమ కుట్టడం వలన వస్తుందని, అందరూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మురికినీరు నిల్వ లేకుండా చేయడం, ప్రతి శుక్రవారం నీటితొట్లు, ట్యాంకులు శుభ్రం చేసుకోవడం, శరీరం నిండా వస్త్రాలు ధరించడం, వేపాకు పొగ వేసుకోవడం వాడాలన్నారు. అనంతరం గ్రామస్తుల నుండి రక్తనమూనాలను సేకరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి బ్రహ్మాజీ, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఎంఎల్‌హెచ్‌పీలు జయంతి, ప్రియదర్శిని, హెల్త్ అసిస్టెంట్లు రామతీర్థం, నాగేశ్వరరావు, ఏఎన్ఎం మల్లిక, ఆశా కార్యకర్త రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

మైదుకూరు : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ గురవయ్య అన్నారు. మంగళవారం ఆయన మైదుకూరులోని విద్యుత్‌సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి అనంతరం ఏఈ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ గురవయ్య మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు, రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. వ్యవసాయ కనెక్షన్ల విషయంలో రైతుల నుంచి ఏవైనా ఫిర్యాదులు అందితే తక్షణమే స్పందించాలని అన్నారు. సీఈ వెంట మైదుకూరు డీఈఈ జీవీ రామిరెడ్డి, ఏడీఈ శ్రీనివాసులరెడ్డి, ఏఈ రామభద్రయ్య ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు సంతకాల సేకరణ

గోపవరం : ఈ నెల 19వ తేదీన విజయవాడ మున్సిపల్ స్టేడియంలో అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా అన్ని సచివాలయాల నుండి సంతకాలు సేకరించి స్టేడియంకు తరలించనున్నట్లు గోపవరం డీఈఓ విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం అన్ని సచివాలయాల్లో సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సర్పంచ్‌లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ వెంకటలక్షుమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటలక్షుమ్మ

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఉపయోగకరం

చాపాడు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు ఉపయోపడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని వెదురూరు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందన్నారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ కార్యదర్శి లలితమ్మ, జిల్లా ఎపిడమాలజిస్ట్ ఖాజా మోహిద్దీన్, ఆరోగ్య విస్తరణాధికారి ప్రసాద్, స్పెషలిస్ట్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో

బ్రహ్మంగారిమఠం : జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం మంగళవారం మండలంలోని డి.నేలటూరులో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బద్వేల్ డివిజన్ వైద్య అధికారి మలేషం, మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, డాక్టర్ చెన్నకేశవరావు, మైదుకూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ భర్త మణ్యం శంకర్‌రెడ్డి, స్థానిక నాయకులు మలుగుడుపాడు సుబ్బారెడ్డి, బి.మఠం ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


వెదురూరు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

గోపవరం : జగనన్న ఆరోగ్య సురక్ష–2 ద్వారా నిర్వహిస్తున్న వైద్యసేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాయినాయక్ పేర్కొన్నారు. మంగళవారం బ్రాహ్మణపల్లెలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ కలువాయిలక్ష్మీదేవి ప్రారంభించారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో 272 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి మోశ, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జనవరి 22న సెలవు ప్రకటించాలి

బద్వేలు అర్బన్ : అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జనవరి 22వ తేదీని సెలవుదినంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఆ సంఘం రీజనల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 500 సంవత్సరాల నాటి కల అయిన అయోధ్య రామ మందిర నిర్మాణం పూర్తయి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జనవరి 22వ తేదీని సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, కొండారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు రామకోటిరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, కేశవరెడ్డి, జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఈఓపీఆర్‌డీకి వినతిపత్రం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మేజర్ పంచాయతీలో పని చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు వేతనాల కోసం మంగళవారం ఈఓపీఆర్‌డీ యాస్మిన్, కార్యనిర్వాహణాధికారి వెంకటసుబ్బయ్యలకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ మాట్లాడుతూ 20 నెలలుగా స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు బకాయి పడ్డాయన్నారు. మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించలేదన్నారు. పండుగ పూట పస్తులుండాల్సిన దుర్గతిలో కార్మికులు ఆవేదన చెందుతున్నారని, వారికి వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.


వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

లంచం లేకుండా పేదలకు పథకాలు

ప్రొద్దుటూరు : రూపాయి లంచం లేకుండా ప్రభుత్వం పేదలకు నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 40వ వార్డులోని బాలాజీ స్కూల్ వద్ద మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే చూపించాలని కోరారు. అర్హులందరికి ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతోందన్నారు. అనంతరం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పొందిన లబ్ధి వివరాల బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వార్డు కౌన్సిలర్ అరుణ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేషారెడ్డి, వార్డు ఇన్‌చార్జి గంజికుంట రామాంజనేయులు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ రాగా నాగలక్ష్మి నరసింహారావు, ఏసీపీ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

భూమి పూజ

స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.25లక్షలతో ప్రహరీని నిర్మించనున్నామన్నారు. అలాగే ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు మరమ్మతులు, చప్పట, ఇతర అభివృద్ధి పనులకు మరో రూ.75 లక్షలతో త్వరలో టెండర్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

విజయవాడలో ఈనెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 125 అడుగుల ఎత్తులో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక వైఎంఆర్ కాలనీలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణ, నందన్‌రెడ్డి, మహేష్ రెడ్డి, గఫూర్, మస్తాన్ వల్లి, లిఖిత్ రెడ్డి పాల్గొన్నారు.